# మార్కెట్ కష్టాలకు చెక్

- చేర్యాలలో రూ.3 కోట్లతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణం
- చకచకా సాగుతున్న నిర్మాణ పనులు
- చుట్టుపక్కల 50 గ్రామాల ప్రజలకు వెసులుబాటు
- పట్టణంలో తప్పనున్న ట్రాఫిక్ కష్టాలు



చేర్యాలలో కొనసాగుతున్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు

చేర్యాల, అక్టోబర్ 24: తెలంగాణ సర్కారు ప్రజల సమస్యలను గుర్తించడంతోపాటు వాటిని ఎక్కడికక్కడ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నది. దశాబ్దాల కాలంగా చేర్యాల గ్రామ పంచాయతీ(ఇప్పుడు మున్సిపాలిటీ), అంగడి బజారు, ఎస్‌బీఐ వద్ద సిద్దిపేట, జనగామ ప్రధాన రహదారిపై కొనసాగుతున్న అంగడికి ఇక సెలవు పలికేందుకు బీఆర్‌ఎస్ సర్కారు రూ.3 కోట్లతో(ప్రభుత్వ ప్రత్యేక నిధులు, మున్సిపల్ సాధారణ నిధులు) ఆధునిక వసతులతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని నిర్మించేందుకు తెలంగాణ సర్కారు నిధులు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులకు ఇటీవల చేర్యాలలో పర్యటించిన వైద్యారోగ్య, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎమ్మెల్యే ముత్తిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఇక రోడ్లపై ప్రతి మంగళవారం కొనసాగే అంగడి, ప్రస్తుతం రేకుల షెడ్డుల్లో కొనసాగుతున్న కూరగాయల షాపులు, మున్సిపాలిటీకి ఇరువైపుల ఉన్న షాపులు, చికెన్, మటన్ షాపులన్నీ ఇక నూతనంగా నిర్మించనున్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనంలోకి పనులు పూర్తి కాగానే మారనున్నాయి. మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కృషితో చేర్యాల పట్టణంలో వెజ్ నాన్ వెజ్ భవనం నిర్మించేందుకు నిధులు విడుదల కావడం, పనులు జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సర్కారు నిర్ణయంతో ప్రజలకు ప్రయోజనం**

పట్టణంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవనం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించడం, నిధులు విడుదల చేయడంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. నియోజకవర్గంలో నిర్వహించే సంతల్లో చేర్యాల పట్టణంలో జరిగే అంగడి ఎంతో పెద్దది. ఈ అంగడికి చేర్యాల, కొమురవెల్లి మండలంలోని 25 గ్రామాలు, మద్దూరు మండలంలోని 15 గ్రామాలు, నంగునూరు మండలంలోని ఖానపూర్, అంక్షాపూర్, కొండపాక మండలంలోని వెలికట్ట, తిమ్మారెడ్డిపల్లి, జనగామ జిల్లా బచ్చన్నపేట, తరిగొప్పుల మండలాలకు చెందిన 10 గ్రామాల ప్రజలు కూరగాయలు కొనుగోలు చేసేందుకు ప్రతి వారం వందల సంఖ్యలో పట్టణానికి వస్తారు. నిత్యం వందల సంఖ్యలో పట్టణ, గ్రామాల ప్రజలు పట్టణంలోని జీపీ షాపుల్లో కూరగాయాలు కొనుగోలు చేస్తారు. అంగడిలో కూరగాయాలు, బట్టలు, మటన్, చికెన్, ఎండు మిర్చి, అల్లం, వెల్లుల్లి, పండ్లు, పసుపు, చేపల విక్రయాలు జరుగుతాయి. ఆధునిక వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవన నిర్మాణంతో పట్టణ ప్రజలతోపాటు పొరుగు గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగనుంది. స్థానికంగా నిర్మాణాలు కొనసాగుతుండడంతో రైతుబజారులో కూరగాయాలు విక్రయిస్తున్నారు. మంగళవారం మాత్రం ఎప్పటిలాగే వారాంతపు అంగడి కొనసాగుతున్నది. పనులు పూర్తయితే ప్రజలకు మేలు జరుగుతుంది.

**సమస్యలకు చెల్లుచీటి**

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణంతో గతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీరనున్నాయి. ఆధునిక వసతులతో నిర్మించే భవన నిర్మాణంతో సమస్యలు తొలిగిపోనున్నాయి. ప్రస్తుతం రైతులు స్థానిక జీపీ పక్కన, ఎస్‌బీఐ, షాదీఖాన, మటన్, చికెన్ షాపుల ముందు దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయాలు కొనసాగిస్తున్నారు. వందలాది మంది వచ్చే మార్కెట్లో వాహనాల పార్కింగ్ లేకపోవడంతో పట్టణంలోని ప్రధాన రహదారిపైనే వాహనాలను పార్క్ చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే వారికి తాగు నీటి వసతి లేక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. వర్షాకాలంలో కూరగాయలు నీటిలో తేలిపోవడం, కొట్టుకుపోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. సిద్దిపేట–జనగామ ప్రధాన రహదారిలో పలువురు కూరగాయాల విక్రయదారులు దుకాణాలు ఏర్పాటు చేసుకొని రాత్రి పొద్దుపోయే వరకు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అంగడి కొనసాగిన రోజు భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధునిక వసతులతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనం నిర్మించేందుకు అనువైన స్థలం లేకపోవడంతో మున్సిపాలిటీ భవనంతోపాటు పక్కనే ఉన్న మున్సిపల్ షాపులు, కూరగాయాల షాపులు, చికెన్, మటన్ దుకాణాలను తొలగించారు. మొదటగా నాన్‌వెజ్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు చకచకా సాగుతున్నాయి. నాన్‌వెజ్ భవనానికి సంబంధించిన డోమ్స్‌ను ఇటీవల సంబంధిత కాంట్రాక్టర్ ఏర్పాటు చేశారు. పెండింగ్‌లో ఉన్న మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.



వీధుల్లో కొనసాగుతున్న అంగడి(ఫైల్)



మల్లేశంపల్లి వద్ద కాల్వ ద్వారా ప్రవహిస్తున్న నీరు

# గోదావరి.. నో వర్రీ

- కాల్వ నీళ్లతో సంబురపడుతున్న రైతులు
- ఎండిపోతున్న పంటలకు జీవం

రాయపోల్, అక్టోబర్ 24: ముబారాస్‌పూర్ గ్రామ శివారులోని మల్లేశంపల్లి గ్రామం తలాపున పారుతున్న గోదావరి కాల్వ ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోస్తున్నది. ఎత్తులో ఉన్న ఈ ప్రాంతానికి నీళ్లు రావని, పంటలు పండవని ఒకప్పుడు చెప్పుకున్న మాటలు పటాపంచలయ్యాయి. సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా గోదావరి నీళ్లు పంట పొలాల్లో పారుతుండటంతో రైతులు పులకించిపోతున్నారు. కాల్వ ద్వారా వస్తున్న నీటితో దాదాపు 800 ఎకరాల్లో వేసిన పత్తి పంట జీవం పోసుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నుంచి విడుదలైన నీరు పంటపొలాల్లో పారుతుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఎండిపోతున్నదనుకున్న పత్తి పంట జీవం పోసుకోవడంతో పంట చేతికి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కాల్వ నీటితో పచ్చగా మారిన పత్తి పంట



కాల్వలో ప్రవహిస్తున్న గోదావరి నీళ్లు

# సీఎం కేసీఆర్‌తో అన్ని వర్గాలకు న్యాయం

**ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 24: సీఎం కేసీఆర్ పాలనలో అన్నివర్గాలకు సముచిత న్యాయం జరిగిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని మదీనా మసీద్‌లో ఇమామ్, మౌజన్లతో సమావేశం నిర్వహించారు. ప్రజ్ఞాపూర్ గ్రామ ముస్లింలు సీఎం కేసీఆర్‌కు మద్దతు పలుకుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆ పత్రాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని, షాదీముబారక్‌తో ఆడబిడ్డల పెండ్లికి అండగా నిలబడ్డారన్నారు. మైనార్టీ గురుకులాలు, కళాశాలల ఏర్పాటుతో విద్యాభివృద్ధి జరిగిందని, ఫలితంగా మైనార్టీ యువత ఉన్నత చదువులు చదువుతున్నారన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ముస్లింల కోసం మదీనా షాపింగ్ కాంప్లెక్స్ చేపట్టి ఉపాధి కల్పించారన్నారు. ఈ ఎన్నికల్లో మైనార్టీలు సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకియొద్దీన్, గజ్వేల్, సదర్ యూసుఫ్, పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, హజ్ కమిటీ సభ్యుడు జాఫర్‌ఖాన్, మైనార్టీ నాయకులు విరాసత్ అలీ, బీఆర్‌ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జుబేర్‌పాషా, సిద్దిపేట జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, నాయకులు మతిన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.



ఏకగ్రీవ తీర్మానప్రతిని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేస్తున్న ప్రజ్ఞాపూర్ ముస్లింలు